సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



పరిహారం చెల్లించాల్సిందే

స్పాంజ్ ఐరన్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నామని వీర్లపల్లి వాసులు ఆందోళనకు దిగారు. 8లో▸



వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

దేశంతో పాటు ఈసారి రాష్ట్రంలో కూడా బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తంచేశారు. 8లో▸



అభివృద్ధిలో మనమే టాప్

అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ అగ్రభాగాన నిలిచిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. 8లో▸



హస్తంలో ముసలం

కాంగ్రెస్‌లో అంతర్గత పోరు
- ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నంలో గుప్పుమన్న విభేదాలు
- శేరిలింగంపల్లి, కల్వకుర్తిలో పత్తాలేని లీడర్లు
- మహేశ్వరం, చేవెళ్ల, షాద్‌నగర్‌లో ఎవరికి వారే
- అయోమయంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎన్నికల వేళ కాంగ్రెస్‌లో కొనసాగుతున్న అంతర్గత విభేదాలు పార్టీకి నష్టం కలిగించేలా మారుతున్నాయి. ఈసారి జరిగే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటి అధికారం చేజిక్కించుకోవాలని ఇటు బీఆర్ఎస్ అటు బీజేపీ హోరాహోరీగా ముందుకు సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆత్మీయ సమ్మేళనాల పేరుతో బీఆర్ఎస్.. ప్రజా సమస్యలే ఎజెండాగా బీజేపీ పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ.. జనానికి దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. కానీ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఆ పార్టీలో గ్రూపులు, తిరుగుబాట్లు మొదలయ్యాయి. ఇప్పటి వరకు అంతర్గతంగా ఉన్న విభేదాలు ఇటీవల ఒక్కసారిగా బహిర్గతమవుతుండటాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. రాహుల్ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర', ప్రస్తుతం కొనసాగుతున్న 'హాత్ సే హాత్ యాత్ర'లు క్షేత్రస్థాయిలో ఓ టానిక్‌లా పని చేస్తాయని అంతా భావించారు. కానీ గ్రూపు రాజకీయాలు, వ్యక్తిగత విమర్శల కారణంగా పార్టీ బలపడకపోగా, పరిస్థితి మరింతగా చేజారుతోంది.

రాంరెడ్డి X ప్రభాకర్‌రెడ్డి

జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఎల్బీనగర్‌లో మంచి పట్టు ఉంది. ప్రస్తుత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇదే పార్టీ నుంచి గెలుపొంది, ఆ తర్వాత అధికార బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి పార్టీకి నాయకత్వ సమస్య తలెత్తింది. మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సోదరుడు మల్‌రెడ్డి రాంరెడ్డి ఎల్బీనగర్‌పై దృష్టిసారించారు. అడపాదడపా పార్టీ కార్యక్రమాలు చేపడుతూ.. అధినాయకత్వం నిర్వహించే సభలు, సమావేశాలకు ఈ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో జనాన్ని తరలిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తాను ఇక్కడి నుంచే పోటీ చేస్తానని ప్రకటించుకున్నారు. ఇదే సమయంలో సీనియర్ నేత ప్రభాకర్‌రెడ్డి మల్‌రెడ్డిపై తిరుగుబాటును ప్రకటించారు. ఇవేమైనా వారసత్వ ఆస్తులా.. అన్నదమ్ములు పంచుకోవడానికి..? అంటూ నిలదీశాడు. స్థానికేతరులకు ఇక్కడేం పని..? అంటూ గట్టిగానే విమర్శించారు. ఎమ్మెల్యే ఫిరాయింపుతోనే సగం చచ్చిపోయిన పార్టీ.. తాజా తిరుగుబాటుతో మరింత సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఎన్నికల వేళ.. తిరుగుబాట్లు, అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతుండటాన్ని కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు.

మల్‌రెడ్డి వర్సెస్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నంలో మొదటి నుంచి పార్టీకి బలమైన కేడర్ ఉంది. అయితే ఎన్నికలకు ముందే ఇక్కడి నేతలు మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, సీనియర్ నేతలు మర్రి నిరంజన్‌రెడ్డి, పీసీసీ మాజీ కార్యదర్శి దండెం రామిరెడ్డిలు మూడు గ్రూపులుగా చీలిపోయారు. ఎవరికి వారు పోటాపోటీగా పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నారు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందిన మర్రి నిరంజన్‌రెడ్డి తానే ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్నారు. మల్‌రెడ్డికి పోటీగా 'హాత్‌సే హాత్' కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ యాత్రను అడ్డుకునేందుకు మల్‌రెడ్డి వర్గీయులు సిద్ధమయ్యారు. మరో వైపు మాజీ పీసీసీ కార్యదర్శి దండెం రామిరెడ్డి సైతం ఒంటరిగానే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇలా ఒకే నియోజకవర్గంలో ముగ్గురు నేతలు పోటీ పడుతుండటం, వేర్వేరుగా కార్యక్రమాలు చేపట్టి, ఒకరిపై మరొకరు బహిరంగ విమర్శలు చేసుకుంటుండటాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేక పోతున్నాయి. ఎన్నికల సమయంలో ఒక్కతాటిపై నిలవాల్సిన పార్టీ నేతలు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తుండటం, నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు పార్టీని ఇబ్బంది పెడుతున్నాయి.

చల్లా X చిగురింత

కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచిన మహేశ్వరంలోనూ లీడర్ల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు పార్టీ పుట్టి ముంచేలా కనిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందే ఇక్కడ అంతర్గత పోరు మొదలైంది. గతంలో ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. ఒకరిద్దరు లీడర్లు పార్టీ మారినా క్షేత్రస్థాయి కేడర్ మాత్రం కాంగ్రెస్‌ను వీడటం లేదు. అయితే మంత్రిని ఎదుర్కొనే అభ్యర్థి ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ అంశంపై ఇప్పటికీ క్లారిటీ లేకపోవడంతో పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంటోంది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, సహా సీనియర్ నేత దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ దంపతులు చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ఎవరికి వారే ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రచారం చేసుకుంటున్నారు. హాత్‌సే హాత్ కార్యక్రమం పేరుతో చల్లా నర్సింహారెడ్డి మీర్‌పేట్, బడంగ్‌పేట్, జల్‌పల్లి మున్సిపాలిటీల్లో తరచూ పర్యటిస్తున్నారు. నేతలు ముగ్గురూ ఒక్కతాటిపైకి రాకపోవడంతో కేడర్ అయోమయానికి గురవుతోంది.

చేవెళ్లలోనూ ఎవరికి వారే

చేవెళ్లలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ అనేది సుస్పష్టం. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన మాజీ ఎమ్మెల్యే రత్నం ఆ తర్వాత అధికార బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి ఇక్కడ గ్రూపు రాజకీయాలు ఎక్కువయ్యాయి. సీనియర్ నేతలు రాచమల్ల సిద్ధేశ్వర్, వసంతం, భీంభరత్, దర్శన్‌లు ఎవరికి వారే ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రచారం చేసుకుంటున్నారు. కీలక నేతల మధ్య సఖ్యత కుదరడం లేదు. ఇదిలా ఉండగా రాష్ట్రంలోని ఏ నియోజకవర్గంలో లేని సమన్వయ కమిటీని చేవెళ్లలో నియమించారు. పీసీసీ అధ్యక్షుడికి కూడా తెలియకుండా ఈ కమిటీని వేశారు. సంస్థాగతంగా పార్టీ ప్రతిష్టతను మరింత దిగజార్చి, వచ్చే ఎన్నికల్లో మరో ప్రతిపక్ష పార్టీ నేతకు లబ్ధి చేకూర్చే విధంగా ఈ ఎంపిక జరిగిందనే ప్రచారం జరుగుతోంది. ఇక శేర్‌లింగంపల్లి, రాజేంద్రనగర్, కల్వకుర్తిలో పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ బలమైన నేతలు లేకపోవడం ఉన్న వారు కూడా గ్రూపులుగా విడిపోవడం పార్టీకి నష్టదాయకంగా మారింది. అధిష్టానం పిలుపు మేరకు అడపాదడపా కార్యక్రమాలు నిర్వహించి ఆ తర్వాత కేడర్‌ను పట్టించుకోవడం లేదనే విమర్శలు లేకపోలేదు. షాద్‌నగర్‌లో వీర్లపల్లి శంకర్ కొంత యాక్టివ్‌గా కనిపించినా.. అధికార పార్టీని ఢీ కొట్టే బలమైన కేడర్ ఆయన వెంట లేకపోవడం పార్టీకి కొంత మైనస్‌గా మారింది.



సాయిరెడ్డిగూడలో ఫార్మా రైతులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్

బఫర్ జోన్ అవాస్తవం

- అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు
- ఫార్మాసిటీ ఏర్పాటుతో లక్షలాది మందికి ఉపాధి లభిస్తుంది
- ఐదేళ్లలో ఊహించని అభివృద్ధి జరుగుతుంది
- భూములు విక్రయించి నష్టపోవద్దు
- మంత్రి సబితారెడ్డి

కందుకూరు: ఫార్మాసిటీ చుట్టూ బఫర్ జోన్ ఏర్పాటు చేస్తారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని, ఇలాంటి వార్తలను ఎవరూ నమ్మవద్దని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన 225 మందికి గురువారం చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫార్మాసిటీ ఏర్పాటుతో లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధిలో ముందంజ వేయనుందని తెలిపారు. ఫార్మా చుట్టూ కన్జర్వేషన్ పరిధిలో ఉన్న ప్రాంతాన్ని అవసరాన్ని బట్టి రెసిడెన్షియల్, హైజోన్‌గా మార్చేందుకు చూస్తున్నారన్నారు. బఫర్ జోన్ ప్రచారాన్ని పట్టించుకోవాల్సిన పనేదిలేదని తెలిపారు. భూములు విక్రయించి నష్టపోవద్దని, రానున్న ఐదేళ్లల్లో ఊహించని విధంగా అభివృద్ధి జరుతుందని వివరించారు. ఫార్మాలో భూములు కోల్పోయిన రైతులకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతో అదనంగా ఎకరాకు 121 గజాల చొప్పున అభివృద్ధి చేసిన లే అవుట్‌లో ప్లాట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ఈ ప్రాంతమంతా గుర్తు పట్టలేని విధంగా మారుతుందని స్పష్టంచేశారు.

కేసీఆర్ గొప్ప మనసుకు నిదర్శనం

జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి మాట్లాడుతూ.. భూములు త్యాగం చేసిన రైతులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం కేసీఆర్, కేటీఆర్ గొప్ప మనస్సుకు నిదర్శనమని కొనియాడారు. పరిశ్రమలు రావడంతో భూముల విలువ పెరిగి రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. అంతకుముందు సాయిరెడ్డిగూడలో రూ.10 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. రూ.2.30 కోట్లతో బేగంపేట నుంచి మాదాపూర్ వరకు చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణానికి బేగంపేటలో శంకుస్థాపన చేశారు. రాచులూరులో కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఎంపీపీ మంద జ్యోతి పాండు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ జి.శమంత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, స్థానిక సర్పంచులు మహేశ్, గోవర్ధన్, ఎంపీటీసీలు టి.ఇందిరదేవేందర్, కాకి రాములు, రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు వెంకట్రామ్ రెడ్డి, ఆనంద్, అర్జున అవార్డు గ్రహీత రవీకాంత్‌రెడ్డి, నాయకులు జయేందర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

12న సైబర్ సెక్యూరిటీ సమ్మిట్

ముఖ్య అతిథిగా హాజరవనున్న మంత్రి కేటీఆర్

హిమాయత్‌నగర్: సైబర్ నేరాల నియంత్రణపై 'హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్' (హెచ్‌సీఎస్సీ) ప్రత్యేక సమ్మిట్‌ను నిర్వహించనుంది. ఈ నెల 12న బంజారాహిల్స్‌లోని తాజ్‌దక్కన్ ఇందుకు వేదిక కానుంది. సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్న విద్యార్థులు, వ్యాపారవేత్తలు, ఇతర వర్గాలకు చెందిన వారు కోట్లాది రూపాయిలు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా వర్గాల వారికి అవగాహన కల్పించేందుకు 'హైదరాబాద్ యాన్యువల్ సైబర్ సెక్యూరిటీ నాలెడ్జ్ సమ్మిట్'లో భాగంగా 'హ్యాక్ సమ్మిట్-2023' పేరుతో దీన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీశాఖ మంత్రి కేటీఆర్ హాజరవుతారని హెచ్‌సీఎస్సీ అధికారికంగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది.

న్యూస్‌రీల్

బీసీ రిజర్వేషన్ పెంపునకు సంతకాల సేకరణ



చౌదరిగూలో సంతకాలు సేకరిస్తున్న బీఎస్పీ నాయకులు

కొందుర్గు: బీసీల రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ నాయకులు చౌదరిగూడలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. చౌదరిగూడ మండల కేంద్రంలో గురువారం బీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగం మాట్లాడుతూ.. తెలంగాణలో బీఎస్పీ అధికారంలోకి వస్తే బహుజనులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, శ్రీనివాసు, దర్శన్, సుగుణ, రాధాకృష్ణ, హరికుమార్ అనంతయ్య పాల్గొన్నారు. అనంతరం మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా దుర్గని శ్రీనివాసు, ఉపాధ్యక్షుడిగా రాజేశ్ చౌహాన్, ప్రధాన కార్యదర్శిగా మల్లేశ్‌గౌడ్, కార్యదర్శిగా శ్రీనివాసు, కోశాధికారిగా నర్సింలును ఎన్నుకున్నారు.

ట్రాఫిక్ అలర్ట్

- ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆంక్షలు
- రేపు సికింద్రాబాద్, బేగంపేట ప్రాంతాల్లో.. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు
- సహకరించాలని కోరిన నగర కొత్వాల్ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఉత్తర మండల పరిధిలో పర్యటించనున్నారు. బేగంపేట, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, పరేడ్‌గ్రౌండ్స్‌లో ఆయన పర్యటన కార్యక్రమాలు ఉన్నాయి. వీటి నేపథ్యంలో ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు విధిస్తూ కొత్వాల్ సీవీ ఆనంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరవాసులు వీటిని దృష్టిలో పెట్టుకుని తమకు సహకరించాలని కోరారు. ఈ సమయంలో మోనప్ప జంక్షన్, సీటీఓ జంక్షన్, సెయింట్ జాన్స్ రోటరీ, సంగీత్ ఎక్స్‌రోడ్స్, చిలకలగూడ జంక్షన్, ఎంజీ రోడ్, ఆర్పీ రోడ్, ఎస్పీ రోడ్ మార్గాల్లో ప్రయాణించవద్దని నగర పోలీసులు సూచిస్తున్నారు.

- టివోలీ జంక్షన్ నుంచి ప్లాజా జంక్షన్, ఎస్బీహెచ్ ఎక్స్‌రోడ్స్ నుంచి స్వీకార్ ఉప్‌కార్ జంక్షన్ మధ్య మార్గాన్ని పూర్తిగా మూసి ఉంచుతారు.
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు సాధ్యమైనంత త్వరగా చేరుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.
- చిలకలగూడ జంక్షన్ వైపు నుంచి ఉన్న రైల్వే స్టేషన్ మార్గాన్ని మూసి ఉంచుతారు. ప్రయాణికులు ప్లాట్‌ఫామ్ నెం.1 వైపు ఉన్న ప్రధాన ఎంట్రీ ద్వారానే స్టేషన్‌లోకి రావాల్సి ఉంటుంది.
- ఉప్పల్ నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే వాహనచోదకులు తార్నాక మార్గంలో కాకుండా రామాంతపూర్, పంజగుట్ట మార్గంలో ప్రయాణించాలి.
- పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభకు వచ్చే వారి వాహనాల కోసం పోలీసులు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించారు. దోబీఘాట్, బైసన్ పోలో గ్రౌండ్స్, ఆర్ఆర్‌సీ గ్రౌండ్స్, కంటోన్మెంట్ పార్క్ గ్రౌండ్, పికెట్ డిపో, నెక్లెస్ రోడ్‌లో ఇవి ఏర్పాటు చేశారు.
- ప్రధాని పర్యటన నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను పూర్తిగా కేంద్ర బలగాలు తమ స్వాధీనంలోకి తీసుకున్నాయి.
- రైల్వే స్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాలపైనా డేగకన్ను వేశారు. దాదాపు రెండు గంటల పాటు ప్రధాని పర్యటన సాగనుంది. ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయంలో దిగే మోదీ అక్కడ నుంచి రోడ్డు మార్గంలో రాకపోకలు సాగించనున్నారు.

శౌచాలయాలకు గ్రీన్ కర్టెన్లు

బంజారాహిల్స్: మొన్నటి వరకు రోడ్ల పక్కన ఉండే పబ్లిక్ టాయ్‌లెట్లు అంటే అపరిశుభ్రతకు కేరాఫ్‌గా ఉండేవి. ఇందులోకి వెళ్లాలంటేనే జనం జడుసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పబ్లిక్ టాయ్‌లెట్లకు మెరుగైన సాకర్యాలు కల్పిస్తున్నారు.

అవినీతి సొమ్ముతో సమ్మేళనాలు



అమీర్‌పేట్‌లో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

- బీఆర్ఎస్ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమైంది
- సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు అప్పుల పాలయ్యారు
- మహేశ్వరంలో మంత్రి సబితారెడ్డి చేసిందేమీ లేదు
- వచ్చే ఎన్నికల్లోనూ ఇక్కడ కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం
- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మహేశ్వరం: అవినీతి సొమ్ముతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ.. ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. అమీర్‌పేట్‌లోని ఆవుల యాదయ్య ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిన అధికార పార్టీ.. ప్రజాప్రతినిధులు, చోటామోటా నాయకులను అప్పుల ఊబిలోకి నెట్టిందని మండిపడ్డారు. ఎక్కువ వడ్డీకి రుణాలు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టిన నాయకులు, కాంట్రాక్టర్లకు సకాలంలో బకాయిలు రావడం లేదన్నారు. దీంతో ఆర్థిక సమస్యలు ఎదుర్కోలేక కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామ పంచాయతీలకు నేరుగా కేంద్రం నుంచి నిధులు పంపించారన్నారు. ఎస్సీ, ఎస్టీ నిధులు పక్కదారి పట్టకుండా కాంగ్రెస్ ఆధ్వర్యంలో తీసుకువచ్చిన సబ్ ప్లాన్ చట్టానికి అధికార పార్టీలు తూట్లు పొడుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణ బాధలు తట్టుకోలేక రాష్ట్రవ్యాప్తంగా 75 సర్పంచ్‌లు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. పల్లె ప్రగతి పేరుతో గ్రామ సర్పంచ్‌లతో పనులు చేయించి, ఏళ్ల తరబడి బిల్లులు ఇవ్వకుండా వారి జీవితాలను నాశనం చేశారని ధ్వజమెత్తారు. మహేశ్వరంలో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలన్నారు. అర్హులైన ఎంతోమందికి రేషన్ కార్డులు, పింఛన్లు, డబుల్ బెడ్ రూం ఇల్లు అందలేదని తెలిపారు. ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాల భూమి వంటి హామీలు ఏమయ్యాయని నిలదీశారు. మంత్రి సబితారెడ్డి మరోసారి నియోజకవర్గ ప్రజలను మోసం చేసేందుకు ఆత్మీయ సమ్మేళనాల పేరుతో కొత్త డ్రామాకు తెరతీశారని ఆరోపించారు. కొంతమంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారినప్పటికీ మహేశ్వరంలో కాంగ్రెస్ బలంగా ఉందని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మహేశ్వరం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సినియర్ నాయకులు ఆవుల యాదయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్లూరు రాజు, మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షుడు అల్లె కుమార్, పార్టీ నాయకులు మంత్రి బాల్‌రాజ్, ఇమ్మడి ప్రవీణ్ పాల్గొన్నారు.

జై హనుమాన్



మొయినాబాద్: హనుమాన్ శోభాయాత్ర



ఆమనగల్లు: యువత కేరింత

హనుమాన్ జయంతి వేడుకలు గురువారం జిల్లాలో వైభవంగా కొనసాగాయి. యువత నృత్యాలు, కాషాయ జెండాల రెపరెపలతో వీధులన్నీ సందడిగా కనిపించాయి. జైశ్రీరామ్.. జైహనుమాన్ నినాదాలు మార్మోగాయి. వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సంబరాల్లో పాల్గొన్నారు. చిన్నారులు, యువకులతో కలిసి చిందేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఔటర్ రింగ్ రోడ్ లీజుకు నాలుగు సంస్థల ఆసక్తి

- 30 ఏళ్ల లీజుకు హెచ్ఎండీఏ సన్నాహాలు

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు తీసుకొనేందుకు నాలుగు నిర్మాణ సంస్థలు ముందుకు వచ్చాయి. ఆసక్తి గల సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా మొదట్లో సుమారు 12 సంస్థలు స్పందించాయి. కానీ ఇటీవల దరఖాస్తు గడువు ముగిసేనాటికి 4 సంస్థలు మాత్రమే పోటీలో నిలిచాయి. ఈగిల్ ఇన్‌ఫ్రా ఇండియా లిమిటెడ్, ఐఆర్‌బి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ లిమిటెడ్, దినేష్ చంద్ర ఆర్ అగర్వాల్ ఇన్‌ఫ్రాకన్ ప్రైవేట్ లిమిటెడ్, గవార్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ సంస్థలు మాత్రమే ప్రస్తుతం పోటీలో ఉన్నాయి. హైదరాబాద్ నగరం చుట్టూ 158 కిలోమీటర్లు ఉన్న ఔటర్‌రింగ్ రోడ్డును 30 ఏళ్ల పాటు ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు హెచ్ఎండీఏ కార్యాచరణ చేపట్టింది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.8000 కోట్ల వరకు ఆదాయం లభించగలదని అంచనా. టోలింగ్, ఆపరేషన్, మెయింటెనెన్స్ అండ్ ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) పద్ధతిలో ఔటర్‌ను లీజుకు ఇవ్వనున్నారు. మొదట టెక్నికల్ కమిటీ బిడ్‌లను పరిశీలించిన అనంతరం ఫైనాన్షియల్ బిడ్‌లపైన దృష్టి సారించనున్నట్లు అధికారులు తెలిపారు.

నేత్రపర్వం.. దివ్య రథోత్సవం



ఆలయ పురవీధుల్లో స్వామివారి దివ్యరథోత్సవం

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దివ్య రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఈ వేడుక బుధవారం అర్ధరాత్రి వరకు అంగరంగ వైభవంగా కొనసాగింది. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారు రథంపై ఆసీనులై ఆలయం చుట్టూ ఊరేగారు. రథాన్ని తాకితే సకల శుభాలు కలుగుతాయనే నమ్మకంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు రథాన్ని లాగారు. ప్రతి ఒక్కరూ తేరును తాకేందుకు పోటీపడ్డారు. ఒగ్గు కళాకారులు, మహిళలు నిర్వహించిన బోనాల నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు రంగరాజన్, ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ సౌందరరాజన్, కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే



బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న కొండా విశ్వేశ్వరరెడ్డి, పార్టీ నేతలు

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి

మొయినాబాద్: దేశ ఐక్యత, భద్రత కోసం స్థాపించిన బీజేపీ నేడు దేశంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన మొయినాబాద్‌లో మాట్లాడారు. రెండు ఎంపీ స్థానాలతో మొదలైన బీజేపీ ప్రస్తుతం మోదీ నాయకత్వంలో దేశంలో సుపరిపాలన అందిస్తోందన్నారు. రాష్ట్రంలో కూడా త్వరలోనే బీజేపీ ప్రభుత్వం రాబోతోందని అన్నారు. మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. బీజేపీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కే ప్రకాష్, శ్రీరాంనగర్ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు జీ గోపాల్ రెడ్డి, నాయకులు రాజమల్లేష్, వెంకటేష్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, వెంకటేష్, అశోక్, లక్ష్మిపతి యాదవ్, శ్రీకాంత్, ఎల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుయాదవ్ పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాల్సిందే

లేకుంటే ఉత్పత్తిని అడ్డుకుంటాం

- స్పాంజ్ ఐరన్ పరిశ్రమ ఎదుట వీర్లపల్లి మహిళల ఆందోళన
- ఐదు పరిశ్రమల్లో నిలిచిన ఉత్పత్తులు



పరిశ్రమ ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న వీర్లపల్లి మహిళలు, నాయకులు

నందిగామ: మండల పరిధిలోని స్పాంజ్ ఐరన్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న నల్లటి పొగ కాలుష్యం వల్ల గ్రామం మొత్తం మసిబారుతోందని వీర్లపల్లి వాసులు ఆందోళనకు దిగారు. గురువారం ఆ పరిశ్రమ ఎదుట ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కే లత ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు ధర్నాకు దిగారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిశ్రమలోకి వెళ్లి పనులను నిలిపివేయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్పాంజ్ ఐరన్ పరిశ్రమల నుంచి వెలువడే వాయు కాలుష్యం వల్ల పంటలు, ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. గ్రామంలోని ఇళ్లన్నీ నల్లగా మారుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సరంలో మూడు సార్లు ఇళ్లకు రంగులు వేయించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ యాజమాన్యం స్పందించి గ్రామంలోని ప్రతి ఇంటికీ ఆరు నెలలకు ఒక్క సారి రంగులు వేసుకునేందుకు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పరిశ్రమను మూసి వేయాలన్నారు. స్పందించిన యాజమాన్యం త్వరలో గ్రామస్తులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరిస్తామని, అప్పటి వరకు ఉత్పత్తులను నిలిపివేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ ఒక వేళ రాత్రి వేళలో గుట్టుచప్పుడు కాకుండా ఉత్పత్తులు ప్రారంభిస్తే పరిశ్రమపై దాడులు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కే శ్రీశైలం, బేగ్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ధర్నాకు రాని నాయకులపై ఆగ్రహం

మొదటి రోజు పరిశ్రమ ఎదుట నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న కొంతమంది నాయకులు గురువారం నాటి నిరసన కార్యక్రమానికి గైర్హాజరు కావడంతో మహిళలు అనుమానం వ్యక్తం చేశారు. మొదటి రోజు వచ్చిన నేతలు రెండో రోజు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆటో డ్రైవర్‌ను బెదిరించి నగదు చోరీ

రాజేంద్రనగర్: ఆటో డ్రైవర్‌ను బెదిరించి అతని వద్ద రూ. 13వేలు చోరీ చేసిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఆటో డ్రైవర్ రియాజ్ అర్ధరాత్రి 2 గంటల సమయంలో డెయిరీ ఫాం వద్ద ప్యాసింజర్ల కొరకు వేచి చూస్తుండగా ఇద్దరు యువకులు వచ్చి అతన్ని బెదిరించారు. అతని వద్ద ఉన్న రూ.13వేలను తీసుకుని పారిపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామ క్రైం ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

రాజేంద్రనగర్: కడుపు నొప్పి భరించలేక గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన అఖిల రమేష్ భార్యాభర్తలు. వీరికి 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు సంతానం ఉన్నారు. కొన్ని రోజులుగా ఆమె కడుపునొప్పితో బాధపడుతోంది. దీంతో ఆమెకు వైద్యం చేయిస్తున్నారు. బుధవావారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్న ఆమె గురువారం ఉదయం చూసే సరికి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించింది. కడుపు నొప్పి కారణంగానే ఆత్మహత్య చేసుకొని ఉంటుందని భావిస్తున్నారు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

షాద్‌నగర్ రూరల్: పట్టణ శివారులోని ఓ బావిలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పట్టణ సీఐ నవీన్‌కుమార్ తెలిపిన ప్రకారం.. ఫరూఖ్‌నగర్‌లోని పీర్లబావిలో నీటిపై గుర్తు తెలియని వ్యక్తి(33) మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలియరాలేదు. మృతుడి శరీరంపై జీన్స్ ప్యాంట్, పూల చొక్కా ఉన్నాయి. మృతుడి ఆచూకీ తెలిసిన వారు షాద్‌నగర్ పీఎస్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. స్థానిక నాయకుడు పిల్లి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

ప్రాణం తీసిన అతివేగం

- డివైడర్‌ను ఢీకొన్న బైక్
- బీటెక్ విద్యార్థి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



శివకుమార్‌రెడ్డి మృతదేహం

ఇబ్రహీంపట్నం: అతి వేగం ఓ విద్యార్థి ప్రాణం తీసింది. బైక్‌ను వేగంగా నడుపుతున్న క్రమంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగల్‌పల్లి గేట్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ కథనం మేరకు.. వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రానికి చెందిన కే శివకుమార్ రెడ్డి(22) బీ జశ్వంత్‌రెడ్డి స్నేహితులు. చింతపల్లిగూడ పరిధిలోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుకుంటూ బీఎన్ రెడ్డి నగర్‌లో గల హాస్టల్ ఉంటున్నారు. వీరు నగరం నుంచి ఇబ్రహీంపట్నం వైపు బైక్‌పై వస్తుండగా మంగల్‌పల్లి క్రాస్ వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న శివకుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. జశ్వంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో దూడ మృతి



కుక్కల దాడిలో చనిపోయిన దూడ

తలకొండపల్లి: కుక్కల దాడిలో దూడ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. దేవుని పడకల్ గ్రామానికి చెందిన కే సత్యనారాయణ బుధవారం సాయంత్రం తన పొలంలో ఆవు, దూడను కట్టేసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా దూడ మృతదేహం కనిపించింది. బుధవారం అర్ధరాత్రి సమయంలో కుక్కలు దాడి చేయడంతో దూడ చనిపోయిందని తెలిపారు.

బావిలో పడి రైతు మృతి

ఇబ్రహీంపట్నం: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి రైతు మృతిచెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపేటకు చెందిన టేకుల జగన్‌రెడ్డి(50) వ్యవసాయ మోటార్ మరమ్మతు కోసం బావిలోకి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరుముల శబ్దానికి ఆగిన ప్రాణం

షాద్‌నగర్ రూరల్: ఉరుములు మెరుపులతో కూడిన శబ్దానికి భయాందోళనకు గురైన ఓ మహిళ ప్రాణాలొదిలింది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండల పరిధిలోని గంట్లవెల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని గంట్లవెల్లిలో సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ శబ్దం వచ్చింది. అదే సమయంలో వాకిట్లో ఉన్న మంగలి అంజమ్మ భయాందోళనకు గురై హఠాత్తుగా కుప్ప కూలిపోయింది. దీంతో గ్రామస్తులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

పథకాలతో పేదలకు లబ్ధి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఎమ్మెల్యే యాదయ్యతో నాయకులు, అర్చకుడు

షాబాద్: సంక్షేమ పథకాలతో పేదలకు మేలు చేకూరుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం ఆయన మండల పరిషత్ కర్యాలయంలో 105 మంది లబ్ధిదారులకు రూ.1.05కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశఋారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరూ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, వైస్ ఎంపీపీ జడల లక్ష్మి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ సైదులుగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ మధు, ఎంపీడీఓ అనురాధ, రైతు సంఘం మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, కార్యదర్శి శ్రీరాంరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీని దర్శించుకున్న ఎమ్మెల్యే

మొయినాబాద్: చిలుకూరు బాలాజీని బుధవారం మధ్యాహ్నం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రంగరాజన్ ఎమ్మెల్యేకు స్వామివారి ఆశీస్సులను అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే యాదయ్య ఆలయం చుట్టూ 11 ప్రదక్షణలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో పూజలు చేశారు. ఆయన వెంట ఎంపీటీసీలు శ్రీనివాస్, మల్లేష్, నాయకులు జయవంత్, ఆంథ్రూ, విష్ణుగౌడ్, రాంచందర్, నర్సింహ్మగౌడ్, శ్రీనివాస్, చెన్నయ్య, నవీన్ తదితరులు ఉన్నారు.

క్యాబ్ డ్రైవర్‌పై కత్తితో దాడి

- కారుతో ఉడాయించిన దుండగులు
- జీపీఎస్‌తో వాహనం గుర్తింపు
- ఇంజన్‌ను ఆఫ్ కావడంతో పారిపోయిన అగంతకులు



దాడిలో గాయపడ్డ డ్రైవర్ మీర్జా ఆజం బేగ్

పహాడీషరీఫ్: విమానాశ్రయానికి వెళ్లాలంటూ క్యాబ్ బుక్ చేసుకున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు డ్రైవర్‌పై కత్తితో దాడికి పాల్పడి కారుతో ఉండాయించిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్టకు చెందిన మీర్జా ఆజంబేగ్(21) ఊబర్ కారు నడుపుతుంటాడు. గురువారం అర్ధరాత్రి 12.45 గంటలకు ఊబర్ యాప్‌లో వచ్చిన మెసేజ్‌కు అనుగుణంగా విమానాశ్రయం వెళ్లేందుకు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులను కారులో ఎక్కించుకున్నాడు. ఓటీపీ నంబర్ అడడగా, ఫోన్‌లో ప్రాబ్లమ్ ఉందని.. కాసేపట్లో చెబుతామని పేర్కొన్నారు. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ దాటగానే మూత్ర విసర్జన కోసం కారు ఆపాలన్నారు. కాసేపట్లోనే విమానాశ్రయం వస్తుందని.. అక్కడే ఆపుతానని డ్రైవర్ బదులిచ్చాడు. దీంతో ఆగ్రహించిన వెనక సీటులో కూర్చున్న వ్యక్తి గట్టిగా పట్టుకోగా.. పక్క సీటులో ఉన్న వ్యక్తి.. డ్రైవర్ తలపై కత్తితో దాడి చేశాడు. గాయాలకు గురైన డ్రైవర్ కిందికి దిగగానే.. ఇద్దరు నిందితులు కారుతో ఉడాయించారు. అనంతరం బాధితుడు విషయాన్ని మరో డ్రైవర్ సాయంతో ఎయిపోర్ట్ పార్కింగ్‌కు చేరుకున్నాడు. తనపై జరిగిన దాడి విషయాన్ని క్యాబ్ డ్రైవర్స్ వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేయడంతో యజమాని అజ్మత్‌కు తెలిసింది. వెంటనే జీపీఎస్ సిస్టం ద్వారా పరిశీలించగా కారు బేగంబజార్‌లో ఉన్నట్లు గుర్తించారు. టెక్నాలజీ సాయంతో ఇంజన్ ఆఫ్ చేయించడంతో నిందితులు కారును వదిలి పరారయ్యారు. చికిత్స అనంతరం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అభివృద్ధిలో మనమే టాప్

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో దేశంలోనే తెలంగాణ అగ్రభాగాన నిలిచిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని శాస్త్రా గార్డెన్‌లో బీఆర్ఎస్ మున్సిపల్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఏ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మిషన్ భగీరథ పథకం కింద రూ. 40 కోట్లు వెచ్చించి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించినట్లు తెలిపారు. పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ. 12 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. జాగా ఉంటే ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పట్నం ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కొహెడాలో రూ. 450 కోట్లతో పండ్ల మార్కెట్ ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. రంగాపూర్ – జాపాల మధ్య 200 ఎకరాల్లో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే తనయుడు ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సీ వెంకటరమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఏ యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏ చంద్రయ్య నాయకులు ఏ వెంకట్‌రెడ్డి, ఎం వేణుగోపాల్ రావు, బీ జగదీశ్ యాదవ్, ఎం అంజిరెడ్డి, జే రాజు పాల్గొన్నారు.